జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన



సాలూరు రూరల్: కరడవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పాచిపెంట: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం పాచిపెంట మండలంలో పర్యటించారు. ముందుగా మాతుమూరు సమీపంలో జరుగుతున్న హరిత రహదారి నిర్మాణ పనులు పరిశీలించారు. పనుల పురోగతిపై ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరతగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పెద్దగెడ్డ జలాశయాన్ని సందర్శించారు. జలాశయం సామర్థ్యం, నీటి నిల్వలపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జైకా నిధులతో కుడికాలువ మరమ్మత్తు పనులు కొంత మేరకు జరిగాయని, మిగతా పనులు కూడా సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. పెద్దగెడ్డను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని, అందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు మరింత కృషిచేయాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించి వైద్య సిబ్బంది, రోగులతో మాట్లాడారు. శిబిరంలో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. ఐరన్ టాబ్లెట్ల కొరతపై సిబ్బంది కలెక్టర్‌కు తెలియజేయడంతో ఆయన వెంటనే డీఎంహెచ్‌ఓతో ఫోన్ చేసి ఐరన్ టాబ్లెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో హేమలత, జిల్లా నోడల్ అధికారి లక్ష్మీకాంత్, తహసీల్దార్ డి.రవి, ఉప తహసీల్దార్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

కరడవలసలో..

సాలూరు రూరల్: మండలంలోని కరడవలస గ్రామంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కరడవలస, జిల్లేడువలస, తదితర గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఆయనకు వివరించారు. ముఖ్యంగా రోడ్లు నిర్మించాలని, అలాగే కరడవలసలో జీసీసీ సబ్‌డిపోను ఏర్పాటు చేయాలని కోరారు. రేషన్ సరుకులు తీసుకునేందుకు దండిగాం గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని, రానుపోనూ 90 కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందిస్తూ.. కరడవలసలో రేషన్ సబ్‌డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. మార్చి నెల నుంచి రోడ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు. గ్రామంలో మంచినీరు, విద్య, వైద్య సదుపాయాలపై కలెక్టర్ ఆరాతీశారు. పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కంటైనర్ ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు పండ్లు, పౌష్టికాహారం అందజేశారు. ఆయన వెంట ఎంపీడీఓ గొల్లపల్లి పార్వతి, సీడీపీఓ విజయలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



పాచిపెంట: పెద్దగెడ్డ జలాశయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

● చెక్‌పోస్ట్ తనిఖీ



పార్వతీపురం: చెక్‌పోస్టు వద్ద రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ఆంధ్రా ఒడిశా సరిహద్దులలో అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సరిహద్దు ప్రాంతమైన పి.కోనవలస వద్ద గల చెక్‌పోస్టును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అక్కిడి రికార్డులను, సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా గంజాయి, మద్యం, సారా రవాణా చేస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు.

క్లుప్తంగా

రైల్వే డీఆర్ఎంకు వినతి

పార్వతీపురం: దుర్గ్ నుంచి విశాఖపట్నం వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు పార్వతీపురంలో హాల్ట్ ఇవ్వాలని కోరుతూ విశాఖపట్నం డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్‌కు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రమైన పార్వతీపురం ప్రాంత ప్రజలకు వందేభారత్ రైలు సేవలు ఎంతో అవసరమని, ప్రజల శ్రేయస్సు దృష్ట్యా పార్వతీపురంలో వందేభారత్ రైలును నిలుపుదల చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపడతానని డీఆర్ఎం తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

పార్వతీపురం: ప్రజలు సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రవీంద్రరాజు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులలో పోలీసులను సంప్రదించేందుకు 100కు ఫోన్ చేయాలన్నారు. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌లను ఓపెన్ చేయొద్దని సూచించారు. సైబర్ మోసాలపై బాధితులు టోల్ ఫ్రీ 1930కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ కె.వెంకటరావు, కానిస్టేబుల్ క్రాంతికుమార్ తదితరులున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ శోబిక

పార్వతీపురం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక అన్నారు. 'మై స్కూల్ మై ప్రైడ్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఏవైనా సందేహాలుంటే తక్షణం ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు వివరించారు. ఇటీవల నిర్వహించిన సమ్మెటివ్ పరీక్షలలో విద్యార్థులు ఏ అంశంలో వెనుకబడివున్నారో గుర్తించి, వాటిపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, షెడ్యూల్ ప్రకారం సిలబస్‌ను పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

రహదారి గుంతలు పూడ్చివేత

సాలూరు: పట్టణంలో బంగారమ్మపేట, బొడ్డవలస మార్గం మధ్యలో రహదారి గుంతలను శుక్రవారం తాత్కాలికంగా పూడ్చారు. స్థానికంగా ఉంటున్న ఓ క్రషర్ యజమాని సౌజన్యంతో గ్రావెల్‌ను తెప్పించి గుంతల్లో వేసి పూడ్చారు. పట్టణ సీఐ అప్పలనాయుడు పనులను పర్యవేక్షించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వెంకటనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం: మండలంలోని గోపాలపురం గ్రామ సర్పంచ్ పెండ రమణ తండ్రి వెంకటనాయుడు ఇటీవల మృతిచెందారు. ఈమేరకు శుక్రవారం గ్రామంలో నిర్వహించే పెద్దకర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని వెంకటనాయుడు చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే మండలంలోని సంగంవలస గ్రామంలో ఆర్థోపెడీషియన్ బడే సత్యనారాయణ తల్లి అన్నపూర్ణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి ఇంటికి మాజీ ఎమ్మెల్యే జోగారావు వెళ్లి పరామర్శించారు. అన్నపూర్ణమ్మ మృతికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట పలువురు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఉన్నారు.

పాచిపెంట ఎస్సైగా వెంకటసురేష్



పాచిపెంట: పాచిపెంట పోలీస్ స్టేషన్ ఎస్సైగా వెంకటసురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన నారాయణరావు పార్వతీపురం వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సాలూరు పట్టణ ఎస్సైగా పనిచేసిన వెంకటసురేష్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో గంజాయి, సారా అక్రమ రవాణా నియంత్రణకు కృషి చేస్తానన్నారు.

పాఠశాల సందర్శన

మక్కువ: మండలంలోని సన్యాసిరాజపురం ప్రాథమిక పాఠశాలను మండల ప్రత్యేకాధికారి అశోక్ కుమార్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టిక, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఎంపీడీవో సూర్యనారాయణ, ఎంఈఓ పెంట సత్యనారాయణతో కలిసి డొక్కా సీతమ్మ పీఎం పోషన పథకం అమలును పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పోలినాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతోనే మలేరియా అంతం



పెదబొండపల్లి పీహెచ్‌సీలో సిబ్బందితో సమీక్షిస్తున్న జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ

పార్వతీపురం: దోమల ఉత్పాదక స్థావరాలను నిర్మూలించడం ద్వారా మలేరియా, డెంగీ వ్యాధులను నివారించవచ్చని జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ అన్నారు. మండలంలోని డోకిశీల, పిండిలోవ, పెదబొండపల్లి, రావికోన గ్రామాలలో శుక్రవారం ఆమె పర్యటించారు. పిండిలోవ గ్రామంలో మలేరియాతో బాధపడుతున్న నిమ్మక పల్లవి, నిమ్మక వాసంతిలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. అనంతరం రావికోన ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను, పార్వతీపురం పట్టణంలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యమే మన సేవలకు కొలమానమని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట జోనల్ విస్తరణాధికారి తిరుపతిరావు, జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి ధనుంజయకుమార్ తదితరులున్నారు.

నిధులు మంజూరు చేయాలి

పార్వతీపురం/మక్కువ: ఏకలవ్య గురుకుల పాఠశాల భవన నిర్మాణాలు పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గిరిజనులకు విద్యను అందించేందుకు పార్వతీపురం జిల్లాలో గురునాయుడుపేట, కురుపాం, అనసభద్రలలో ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అయితే నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయని, దీని వల్ల విద్యార్థులకు వసతి సమస్య వేధిస్తోందని అన్నారు. ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

వెలుగు సిబ్బంది ఔదార్యం



ఈశ్వరరావు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న వెలుగు సిబ్బంది

సాలూరు రూరల్: మండలంలోని తోణాం క్లస్టర్ పరిధిలో వెలుగు కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌గా సేవలందించిన కొర్లాపు ఈశ్వరరావు ఇటీవల మృతి చెందాడు. వెలుగు జిల్లా పీడీ సత్యంనాయుడు ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది శుక్రవారం ఈశ్వరరావు స్వగ్రామం ఎరగడవలస వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి తమవంతు సాయంగా రూ.1,05,500లు చెక్కును అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదయ్య, సింహాచలం పాల్గొన్నారు.

శ్యామలాంబ పండుగ తేదీలను నిర్ణయించేది

ధర్మకర్తలు, గ్రామ పెద్దలే..

● మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: సాలూరు శ్యామలాంబ తల్లి పండుగ తేదీలను నిర్ణయించి, ప్రకటించే అధికారం ధర్మకర్తలు, గ్రామ పెద్దలకే ఉంటుందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అభిప్రాయపడ్డారు. పట్టణంలో తన నివాసంలో శుక్రవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. 2019లో శ్యామలాంబ తల్లి పండుగ నిర్వహించాలని అందరూ భావించినా.. కోవిడ్ కారణంగా పండుగ జరుపుకోవద్దని గ్రామ పెద్దలే తెలిపారని గుర్తుచేశారు. రెండేళ్ల తరువాత మళ్లీ పండుగ నిర్వహణ చర్చకు రాగా, పూజారి కుటుంబంలో తలెత్తిన పరిస్థితులు, ఇతర కారణాల వల్ల పెద్దలు పండుగను మరోసారి వాయిదా వేశారని తెలిపారు. పండుగ నిర్వహణలో భాగంగా భక్తులకు మౌలిక వసతుల కల్పన, శాంతిభద్రతలు తదితర అంశాల్లో స్థానిక ఎమ్మెల్యే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పండుగ నిర్వహణకు స్థానిక ఎమ్మెల్యే లేదా మంత్రి ప్రభుత్వం, ఎండోమెంట్, తన శాఖ నుంచి నిధులు సమకూర్చాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తాను గతంలో ఉపముఖ్యమంత్రిగా, గిరిజన సంక్షేమశాఖా మంత్రిగా ఉన్నప్పుడు పాడేరు మోదుకొండమ్మతల్లి పండుగకు కోటి రుపాయలు, శంబర పండుగకు రూ.50 లక్షలు తీసుకురావడం జరిగిందని గుర్తుచేశారు. శంబర పండుగకు మంజూరు చేయించిన డబ్బులు పూర్తిస్థాయిలో వినియోగించలేకపోయారని తెలిపారు.

మే నెలలో శ్యామలాంబ పండుగ

సాలూరు: సాలూరు గ్రామదేవత శ్యామలాంబ తల్లి పండుగను వచ్చే ఏడాది మే నెలలో నిర్వహించాలని పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం సాలూరు పట్టణంలో యువరాజు నివాసం వద్ద పలువురు నాయకులు, పెద్దలు సమావేశమయ్యారు. వచ్చే ఏడాది మే నెలలో పండుగ నిర్వహించేందుకు అందరూ సుముఖత వ్యక్తం చేశారు. పట్టణంలో అన్ని వార్డుల్లో పెద్దలతో మరోసారి సమావేశమై తేదీలను ఖరారు చేద్దామని నిర్ణయించారు. సమావేశంలో మంత్రి సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

నాడు లేని ఆంక్షలు నేడెందుకు?

● మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరు: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో గతంలో ఎన్నడూ లేని ఆంక్షలను ఇప్పుడే చూస్తున్నామని, ఉత్సవాల నిర్వహణలో ప్రభుత్వం ఆంక్షలు పెట్టడమేంటని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రశ్నించారు. పట్టణంలోని తన స్వగృహంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు 9 రోజుల్లోనే ముగించాలని ఆదేశాలు జారీ చేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే అన్నారు. గతంలో 11 రోజులకు పట్టణంలోని 90 శాతం విగ్రహాలు నిమజ్జనాలు జరిగేవని, కొన్ని మండపాల్లోని విగ్రహాలు అయితే 21 రోజుల వరకు పూజలు అందుకునేవని గుర్తుచేశారు. శాంతిభద్రతల సాకు చూపుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా నిబంధనలు రూపొందించి ఉత్సవ సందడిని ప్రజలకు దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. తాను పద్దెనిమిదిన్నర సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఏనాడు ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా పనిచేయలేదని అన్నారు. గతంలో ప్రజలు ఏవిధంగా అయితే పండగలు జరుపుకునేవారో అదేవిధంగా నిర్వహించుకునేలా ప్రభుత్వం సహకరించాలని కోరారు.

చిరస్మరణీయుడు సీతారం ఏచూరి



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెంకటరమణ

సీతానగరం: కమ్యూనిస్ట్ దిగ్గజం, సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీరనిలోటని ఆపార్టీ నాయకుడు జి.వెంకటరమణ అన్నారు. మండలంలోని బుడ్డిపేటలో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి మండల కమిటీ సంతాపాన్ని ప్రకటించిందన్నారు.

కమ్యూనిస్ట్ పార్టీలో గొప్ప మానవతావాది, మార్క్సిస్ట్ నేతగా ఆయన్ను అభివర్ణించారు. గత నెల 19న ఊపిరితిత్తుల సమస్యతో ఎయిమ్స్‌లో చేరిన ఆయన అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాశ విడిచారన్నారు. విద్యార్థి నాయకుడి నుంచి పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన ఏచూరి ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడుగా కొనియాడారు. కార్యక్రమంలో రైతు, కార్మిక, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీవో 115 రద్దు చేయాలి



కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసనలో సంఘీభావం తెలుపుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కుమార్

పార్వతీపురం: కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులకు అన్యాయం చేసే జీవో 115ను రద్దు చేయాలని కాంట్రాక్ట్ సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మూడు రోజులుగా జిల్లా ఆస్పత్రి ఆవరణలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ కాంట్రాక్ట్ నర్సు సిబ్బందికి శుక్రవారం సంఘీభావం తెలిపారు. గత 15 ఏళ్లుగా విధులను నిర్వహిస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయకుండా కొత్తగా రిక్రూట్‌మెంట్ చేపట్టడం వల్ల కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు సీహెచ్.రమణమూర్తి, ఎస్.నారాయణరావు, పి.భారతి, పి.లక్ష్మి, అనుశ్రీ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



మాట్లాడుతున్న డాక్టర్ రాధాకాంత్

సీతానగరం: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ అన్నారు. ఏగోటివలసలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన పాల్గొని సుమారు 70 మందికి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పలువురు జ్వరాలు, దగ్గు, జలుబు, బీపీ, సుగర్, ఆస్తమా, కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. రోగులకు అవసరమైన మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచామన్నారు. 104 ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జీ సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం బి.రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కరు, సచివాయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కిశోర బాలికల్లో రక్తహీనత నివారించాలి



విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్మోహనరావు

పార్వతీపురం: కిశోర బాలికల్లో రక్తహీనతను గుర్తించి నివారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.జగన్మోహనరావు అన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే సంక్షేమ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హెల్త్ రికార్డులను పరిశీలించారు. రక్తహీనత ఉన్న వారికి అవసరమైన పోషక పదార్థాలను, ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందించాలన్నారు. సిక్ రిజిస్టర్‌లో నమోదైన విద్యార్థునుల ఆరోగ్యస్థితిపై ఆరాతీశారు. అలాగే జిల్లా ఆస్పత్రిలోని పోషకాహార పునరావాస కేంద్రాన్ని(ఎన్‌ఆర్‌సీ)ని ఆయన పరిశీలించి బరువు తక్కువ, పోషకాహార లోపం ఉన్న పిల్లల ఆరోగ్యంపై ఆరాతీశారు. ప్రతీ నెలా నమోదు అవుతున్న జ్వర పీడితుల వివరాలను పరిశీలించారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ-1

బలిజిపేట: మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో విజేతలుగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు చేరుకోవాలని ఎంఈఓ-1 సామల సింహాచలం ఆకాంక్షించారు. బలిజిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మండలస్థాయి స్కూల్ గేమ్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్: మండలం మామిడిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని 15 పాఠశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పీడీ గొడ్డు చక్రవర్తి ఫెడరేషన్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీలను నిర్వహించారు. విజేతలు ఈ నెల 19,20 తేదీల్లో నిర్వహించే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఇన్‌చార్జి పీడీ తెలిపారు.

పేదల అనుభవంలోని భూములకు పట్టాలివ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మక్కువ: పేదల అనుభవంలో ఉన్న ఇళ్ల పట్టాలు, వ్యవసాయ సాగు పట్టాలు పేదలకు అందించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక మజ్జి గౌరమ్మ ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. తూరుమామిడి గ్రామంలో జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల్లో చేసిన అక్రమాలపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేసి, బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే హక్కుదారులు లేని భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, సర్పంచ్ నుంచి నగదు రికవరీ చేసి, సర్పంచ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడుభూములకు పట్టాలివ్వాలని, పెత్తందారులు ఆక్రమించుకున్న పేదల భూములను స్వాధీనం చేసుకొని పేదలకు తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగనాయుడు, వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, మండల కార్యదర్శి ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

40 మందిపై బైండోవర్

పార్వతీపురం: పట్టణంలో 40 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సంతోషికుమారి శుక్రవారం తెలిపారు. బైండోవర్ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే రూ.2 లక్షలు జరిమానా విధించడమే కాకుండా చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. వినాయక నిమజ్జనంలో ఎలాంటి అల్లర్లు సృష్టించినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ సోమేశ్వరరావు హెచ్చరించారు.

వైద్యమో.. రామచంద్రా..

- పనసలవలస విజృంభిస్తున్న విషజ్వరాలు
- పదుల సంఖ్యలో జ్వరపీడితులు
- అందని వైద్య సేవలు
- మౌలిక వసతులకు నోచుకోని గ్రామస్తులు



జ్వరంతో బాధపడుతున్న సరాయివలస ఆశ్రమ పాఠశాల విద్యార్థిని సీదరపు వసంత



జ్వరంతో మంచంపట్టిన చంద్రమ్మ

సాలూరు రూరల్: మండలంలోని పట్టుచెన్నూరు పంచాయతీ పనసలవలస గిరిజన గ్రామంలో విషజ్వరాలతో పాటు పలు సమస్యలు గ్రామస్తులను పీడిస్తున్నాయి. గ్రామంలో సీజనల్ జ్వరాల బారినపడి పలువురు రోజుల తరబడి మంచానికే పరిమితమవుతున్నారు. అయినా అధికారులు గ్రామంలో ఇప్పటివరకు కనీసం దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడం ఆ గ్రామంపై అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. జ్వరాలతో బాధపడుతున్న వారికి సంచివైద్యులు ఒక సెలైన్, ఒక ఇంజక్షన్ వేసి రూ.500లు వరకు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గ్రామంలో సరాయివలస ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని వసంత జ్వరంతో బాధపడుతుంటే వార్డెన్ ఇంటికి పంపించేశారని తల్లిదండ్రులు చెపుతున్నారు. హాస్టల్ నుంచి వచ్చినప్పటి నుంచి తమ పాప మంచంపైనే ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి కనీసం ప్రథమ చికిత్స అందించే నాథుడు కరువయ్యాడని గ్రామస్తులు వాపోతున్నారు. గత ఏడాది ఏఎన్ఎంలు తరచూ వస్తుండేవారని, ఈ ఏడాది కనీసం మా గ్రామంలో ఆరోగ్య సిబ్బంది జాడ కూడా ఇంతవరకు కానరాలేదని ఆరోపిస్తున్నారు.

అందని పశువైద్యం..

ఇదిలా ఉండగా పోడువ్యవసాయంతో పాటు వారి జీవనాధారంగా మేకలు పెంచుకుంటున్నారు. అయితే సీజనల్ వ్యాధులతో మేకలు పదుల సంఖ్యలో చనిపోతున్నాయి. దీంతో తామంతా ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. గతంలో పశువైద్య సిబ్బంది గ్రామానికి వచ్చి మేకలకు టీకాలు వేసేవారని, ప్రస్తుతం టీకాలు వేసేందుకు పశువైద్య సిబ్బంది గ్రామానికి రావడంలేదని అంటున్నారు. ఇప్పటివరకు ఈ నెలలో 30 మేకలు వ్యాధులతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. జబ్బు వచ్చిన మేకలకు ప్రైవేటు మెడికల్ షాపులలో మందులు కొనుగోలు చేస్తున్నామని, ఒక మేక కోసం కనీసం రూ.500లు ఖర్చుచేయాల్సి వస్తోందని పెంపకందారులు వాపోతున్నారు. అలాగే గ్రామంలో కరెంట్ ఉన్నప్పుడు మాత్రమే తాగునీరు ఉంటుందని, లేదంటే పక్కనే ఉన్న గెడ్డలో నీళ్లు తాగాల్సి వస్తుందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని వారంతా కోరుతున్నారు.

ఇంతవరకు వైద్య సిబ్బంది మా గ్రామానికి రాలేదు

గ్రామంలో వైద్య సిబ్బంది పర్యటించడం లేదు. జ్వరాల బారిన పడిన వారికి మందులు ఎవరూ ఇవ్వడం లేదు. ప్రతి ఇంటిలోనూ జ్వరపీడుతులు ఉన్నారు. గ్రామంలో మౌలిక వసతులు సరిగా లేవు. గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరుతున్నాం.

– బాదంగి రాజయ్య, పనసలవలస గ్రామం

సంచివైద్యులే మాకు దిక్కు



జ్వరం వచ్చినా.. జబ్బు వచ్చినా.. సంచివైద్యులే మాకు దిక్కు అవుతున్నారు. సంచివైద్యులకు డబ్బులు ఇచ్చేంత ఆర్థిక స్తోమత లేకపోయినా తప్పడం లేదు. వారే సమయానికి వచ్చి వైద్యం చేస్తారు. ప్రభుత్వ సిబ్బంది అంతగా పట్టించుకోరు.

– తాడంగి కృష్ణ, పనసలవలస

మేకలు చనిపోతున్నాయి



మా జీవనాధారమైన మేకలు జబ్బులతో చనిపోతున్నాయి. గతంలో పశువైద్య సిబ్బంది వచ్చి టీకాలు వేసేవారు. ఇప్పుడు రావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి. ఒక మేక చనిపోతే ఏడాది కష్టం పోతుంది. గ్రామంలో ప్రతి ఇంటి లో ఉన్న మేకలు చనిపోతున్నాయి.

– సీదరపు రోజ, గుంజమద